క్లుప్తంగా

వెంకన్నకు లక్ష తులసి పూజ



స్వామివారికి లక్ష తులసి పూజ చేస్తున్న అర్చకులు

పెరవలి: పశ్చిమ గోదావరి జిల్లాలో రెండో ద్వారకా తిరుమలగా పేరుగాంచిన అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలు, వంద్ల రసాలతో అభిషేకాలు నిర్వహించి, అనంతరం 108 మంది దంపతులతో కుంకుమార్చన చేశారు. అనంతరం లక్షతులసి పత్రి పూజ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

దుస్తుల పంపిణీ

గోపాలపురం: మండలంలోని మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆదివారం వృద్ధులు, చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. వేళ్లచింతలగూడెం మానవతా సభ్యుడు కుక్కల కీర్తికుమార్ సమకూర్చిన దుస్తులను నిరుపేదలకు అందజేయడం అభినందనీయమని మండల మానవత అధ్యక్షుడు బూరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మండల చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, నెల్లి చంద్రశేఖర్, ముప్పన కృపాప్రసాద్, మడిచర్ల అశోక్‌కుమార్, నక్కి సత్యనారాయణరెడ్డి మానవతా సభ్యులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు చలివేంద్రం వద్ద మజ్జిగను పంపిణీ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోలు అమ్మకంతో రూ.1,40,841 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ. బళ్ల నీలకంఠం(శివ) తెలిపారు.

నేడు స్పందన కార్యక్రమం

చాగల్లు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి అర్జీలు అధికారులు స్వీకరిస్తారని తెలిపారు.

కొవ్వూరు: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం పది గంటలకు నిర్వహించే స్పందన కార్యక్రమంలో మండల ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవచ్చని తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, ఎంపీడీవో కె.ప్రసన్నకుమార్ తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లపై నేడు సమీక్ష

కొవ్వూరు: మండల రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లపై డివిజనల్ అభివృద్ధి అధికారి కాంత మణి సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.ప్రసన్నకుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం నిర్వహించే ఈ సమావేశానికి వీఆర్‌ఏలు, వీఆర్వోలు, అధికారులు హాజరుకావాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చాగల్లు: జిల్లా పీఎంపీల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిక్కాల గ్రామంలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. తులసి ఫార్మసీ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని పీఎంపీల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర యాక్షన్ కమిటీ చైర్మన్ ఎస్.కోటేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎస్. రామకృష్ణ గౌడ్ మాట్లాడారు. పీఎంపీల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వెంకన్నబాబుపై అసత్య ఆరోపణలు తగవు

గోపాలపురం: ద్వారకాతిరుమల ఎంపీపీ భర్త బొండాడ వెంకన్నబాబుని దళిత వ్యతిరేకిగా చిత్రీకరిస్తూ కొంత మంది సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలు చేయడాన్ని గోపాలపురం దళిత నాయకులు తీవ్రంగా ఖండించారు. ఆదివారం గోపాలపురంలో దళిత నాయకులు సాలి వేణు, కొడవటి బుజ్జిబాబులు విలేకరులతో మాట్లాడారు. దళితులపై దాడులు చేసే నైజం వెంకన్నబాబుకు ఉంటే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలను ఏర్పాటు చేస్తారా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలో అవినీతి లేని పాలన సాగిస్తుండంతో వెంకన్నబాబుపై లేని పోని ఆరోపణ చేస్తున్నారని, ఆరోపణలు చేస్తున్నవారికి త్వరలో తగిన గుణపాఠం చెబుతామని నాయకులు వేణు, బుజ్జిబాబు పేర్కొన్నారు.

మే డే వేడుక పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

కొవ్వూరు: ప్రపంచ కార్మికుల దినోత్సవానికి కార్మికులంతా హాజరుకావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు పేర్కొన్నారు. ఆదివారం కార్మికుల డిమాండ్‌తో కూడిన పోస్టర్‌ను ఆయన నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్మికుల హక్కులను పరిరక్షించుకోవాలన్నారు. కొవ్వూరులో చేపట్టే ర్యాలీలో అందరూ పాల్గొనాలని కోరారు. జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు వల్లేపల్లి నరసింహామూర్తి, జిల్లా గౌరవ అధ్యక్షుడు మైగాపుల నాగేశ్వరరావు, దొరయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆనందాల హరివిల్లు

- ఇందిరమ్మ కాలనీవాసుల కల సాకారం
- ఏ ఆధారాల్లేని 1,055 మందికి ఇళ్ల పట్టాలు
- మొదటి విడతగా 781 పట్టాలు పంపిణీ
- హోమ్ మంత్రి వనిత చొరవతో న్యాయం
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



ఇందిరమ్మ కాలనీ వాసులకు పట్టాలు అందజేస్తున్న హోమ్ మంత్రి వనిత, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ తదితరులు

కొవ్వూరు: ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న కొవ్వూరు ఇందిరమ్మ కాలనీ వాసుల కల నెరవేరింది. రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి చొరవతో తొలివిడతగా 781 మందికి ఇళ్ల పట్టాలు అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జారీ చేసి జీవో నంబర్ 60,2021లో జీవో నంబర్ 225 ప్రకారం ఏ విధమైన ఆధారాల్లేని అర్హత కలిగిన 1,055 కుటుంబాలకు మేలు చేకూరనుంది. పదిహేనేళ్లకి పైగా నెలకొన్న లబ్ధిదారుల సమస్యకు వైఎస్సార్ సీపీ మోక్షం కల్పించడంపై సర్వత్రా హర్షతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇందిరమ్మ కాలనీవాసులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కొవ్వూరు పట్టణనడి బొడ్డున 2006-07లో పదహారు ఎకరాల్లో 1,567 మందికి ఇళ్ల పట్టాలిచ్చారు. జీప్లస్ వన్ కేటగిరిలో ఇళ్ల నిర్మాణం చేశారు. లబ్ధిదారులు అప్పట్లో ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాలతో కొందరు ఇళ్లు అమ్ముకున్నారు. కొందరు ప్రారంభంలో ఇళ్ల, స్థలాలు విక్రయించు కోగా, మరి కొందరు సగం నిర్మాణం పూర్తి చేసిన తరువాత అమ్ముకున్నారు. ఈ ప్రాంతం పట్టణంలో మధ్యలో ఉండడంతో ఇలా ఒక్కో ఇళ్లు ఐదారుగురు చేతులు మారాయి. ఏళ్ల తరబడి నివాసం ఉంటున్నా ఏ విధమైన హక్కు పత్రాల్లేవు. ఇంటి పన్ను, విద్యుత్ సర్వీస్‌లు సైతం గతంలో మంజూరైన వాళ్లపేరుతోనే వస్తున్నాయి. దీంతో ఇళ్లు కొనుక్కున్న వాళ్లు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. స్థానిక హోమ్ మంత్రి వనిత ఇటీవల గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీంతో కాలనీ వాసులు వారి సమస్యను ఏకరు పెట్టుకున్నారు. మంత్రి చొరవతో అధికారులు వివిధ రకాల సర్వేలు చేసి అర్హతలను ప్రమాణికంగా తీసుకుని ప్రస్తుతం నివాసం ఉంటున్న వారి పేరుతో ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. సుమారు పదిహేనేళ్లు ఏ ప్రభుత్వం వీరి గోడును పట్టించుకోలేదు. ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సమస్యను పరిష్కరించడంతో లబ్ధిదారులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. ఆ సంతోషాన్ని వారి మాట్లల్లోనే తెలుసుకుందాం.


ఎంతో విలువైన ఇళ్ల స్థలాలు



ఇంత విలువైన ప్రాంతంలో కాలనీ ఇవ్వడం ఒక వరం. పదేళ్ల నుంచి కాలనీలో నివాసం ఉంటున్నాం. మా దగ్గర ఏవిధమైన ఆధారాల్లేవు. ఈ ప్రాంతంలో గజం రూ.20వేల నుంచి రూ.25 వేల వరకు పలుకుతోంది. ఇంతటి విలువైన ప్రాంతంలో కాలనీ ఇవ్వడమే కాకుండా ఇప్పుడు ఇంటి పట్టా ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది.

–సీతా అనంతం, లబ్ధిదారురాలు,కొవ్వూరు

13 ఏళ్ల నిరీక్షణ



కాలనీలో 13 ఏళ్ల క్రితం వైఎస్సార్ హయాంలో ఇందిరమ్మ రెండో విడతలో ఇళ్లు నిర్మించుకున్నాం. ఇప్పటి వరకు ఏవిధమైన ఆధారాల్లేవు. ప్లాటు నెంబర్ 200ఎఫ్ఎఫ్‌లో నివాసం ఉంటున్నాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కాలనీ వాసుల సమస్యను గుర్తించి పట్టాలు ఇవ్వడం సంతోషంగా ఉంది. ఎంతో ఆందోళనలో ఉండేవాళ్లం.

–షేక్ షకీరా బేగం, లబ్ధిదారురాలు, కొవ్వూరు

మా ప్రభుత్వం పేదల పక్షపాతి



ప్రతి పేదవాడికి న్యాయం చేయాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల పక్షపాతి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవోలు 60,225 జీవోల ప్రకారం ఇళ్ల పట్టాలు ఇవ్వగలిగామంటే జగనన్న చలువే. గతంలో టీడీపీ ఓటు బ్యాంకు రాజకీయాలకు ప్రాధాన్యం ఇచ్చింది. ఇందిరమ్మ కాలనీవాసులు గోడు పట్టించుకోలేదు. అర్హతల కలిగిన వారందరికి ఇళ్ల క్రమబద్ధీకరణ చేస్తున్నాం. అధికారులు సర్వే చేసి 1,055 మందికి అర్హత ఉన్నట్టు గుర్తించారు. తొలి విడతగా 781 మందికి పట్టాలు అందించాం. అన్నీ అర్హతలు ఉండి ఎవరికైనా పట్టా అందినట్టయితే పరిశీలించి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

–తానేటి వనిత, రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి

1,055 మందిని అర్హులుగా గుర్తించాం



రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత కాలనీవాసులకు పట్టాలివ్వాలని ఆదేశించారు. గత నెల రోజులు సమగ్ర సర్వేలు నిర్వహించి 1,055 మందిని అర్హులుగా గుర్తించాం. ప్రభుత్వం జారీ చేసిన జీవో 60,225 జీవోల ప్రకారం ప్రస్తుతం నివాసం ఉంటున్న వారికి క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకున్నాం. ఇంకా అర్హత ఉండి రానివాళ్లు ఉంటే మరోసారి పరిశీలించి న్యాయం చేస్తాం. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ఉండడం చేతనే నెలలోపులోనే ఇళ్ల పట్టాలు ఇవ్వగలిగాం.

–ఎస్.మల్లిబాబు, ఆర్డీవో, కొవ్వూరు

మంత్రికి కృతజ్ఞతలు



కాలనీలో ఏళ్ల తరబడి ఏ విధమైన ఆధారాల్లేకుండా నివాసం ఉంటున్నాం. ప్రభుత్వ సమగ్ర సర్వే చేయించి ఇంత త్వరితగతిన ఇళ్ల పట్టాలు ఇవ్వడం ఆనందంగా ఉంది. అసలు ఎవరు ఊహించలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఎప్పటికీ రుణ పడి ఉంటాం. హోమ్ మంత్రి వనితకు కాలనీ వాసుల తరుపున కృతజ్ఞతలు.

–గంధం సరిత, లబ్ధిదారురాలు,ఇందిరమ్మ కాలనీ

రుణపడి ఉంటాం



ఆరేళ్ల క్రితం కాలనీ ఇళ్లు కొనుక్కున్నాం. భార్య, భర్తలు ఇద్దరం టైలరింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. తొలుత అందరు భయపెట్టారు. ఏ విధమైన ఆధారాల్లేకుండా ఎందుకు కొనుక్కుంటున్నారని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దయ వల్ల ఆ భయం పోయింది. చేతికి పట్టా వచ్చింది. ప్రభుత్వానికి ఎప్పటికీ రుణ పడి ఉంటాం.

–ఎస్‌కే షబీరున్నీషా, లబ్ధిదారురాలు, కొవ్వూరు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



అన్నదేవరపేటలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి తానేటి వనిత

- హోమ్ మంత్రి తానేటి వనిత
- అన్నదేవరపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం

తాళ్లపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకే అందిస్తోందని రాష్ట్ర హోమ్ మంత్రి డాక్టర్ తానేటి వనిత తెలిపారు. అన్నదేవరపేటలో మూడో రోజు ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, నాయకులతో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లి ఈ మూడున్నరేళ్లలో సంక్షేమ పథకాలు ద్వారా పొందిన లబ్ధిని గ్రామస్తులకు వివరించారు. అందరినీ ఆప్యాయంగా పలకరించారు. అనంతరం మహిళలు తెలిపిన సమస్యలు విని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ అందరూ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికు అండగా ఉండి మళ్లీ అధికారంలోకి రావాలని ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు పోశిన శ్రీకృష్ణ దేవరాయులు, సర్పంచ్ ఎలిపే సుధారాణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు ఎం.దమయంతి, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులను దోచుకుంటున్న మిల్లర్లు

- ఇంకా ఇబ్బంది పెడితే సహించేది లేదు
- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: నూక ముసుగులో రైతులను మిల్లర్లు దోచుకుంటున్నారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల సక్షేమానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేసి, అన్ని విధాలా ఆదుకుంటున్నప్పటికీ పండించిన ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను మిల్లర్లు మోసం చేస్తున్నారని ఆయన అన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లపై దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం జిల్లా పౌరసరఫరా అధికారులు, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు, రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ధాన్యం అమ్మకాల్లో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అధికారులతో ఆయన చర్చించారు. రైతులను మిల్లర్లు భయపెడుతున్నారని, మిల్లుకు వెళ్లిన లారీలు రెండు, మూడు రోజుల వరకూ ఉండిపోతున్నాయని, సకాలంలో దిగుమతి చేయడం లేదని ఆయన తెలిపారు. అటువంటి మిల్లులపై చర్యలు తీసుకోవాలని, మిల్లర్లు పెడుతున్న ఇబ్బందుల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని ఆయన చెప్పారు. నూక శాతం ఎక్కువగా ఉందని బస్తాకు 6 కిలోల ధాన్యం కోత వేస్తున్నారని, దీని ప్రకారం రైతులను లారీకి రూ.50 వేలు చెల్లించాలని మిల్లు యజమానులు ఒత్తిడి తెచ్చి ఇబ్బంది పెడుతున్నారని ఆయన అధికారులకు వివరించారు. దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల రైతులకు అనపర్తి మిల్లులు ట్యాగ్‌ఇన్ చేయడం వల్ల ఇబ్బంది పడుతున్నారని, చిన్న రైతులకు స్థానికంగా ఉన్న మిల్లులను ట్యాగ్ ఇన్ చేయాలని ఆయన అధికారులకు సూచించారు. వాతావరణంలో మార్పులు వస్తున్నందున రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపించాలన్నారు. రైతులు నరహరిశెట్టి రాజేంద్రబాబు, సత్తి జగదీశ్వరరెడ్డి, వెల్లంగి సుబ్రహ్మణ్యం, దుగ్గిరాల రమేష్ మాట్లాడుతూ మిల్లర్లు రైతులకు నరకం చూపిస్తున్నారని, దిగుబడి బాగున్నప్పటికీ సకాలంలో అమ్ముకోలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లుకు వెళ్లిన లారీ మూడు రోజులకు కూడా తిరిగి రావడంలేదని, ధాన్యం లోడు దింపుకోకుండా మిల్లర్లు రైతులతో బేరలాడుతున్నారన్నారు. నూక శాతం ఎక్కువగా ఉందని లారీకి రూ.50 వేలు కట్టమంటే ఎలా కడతామని ఆవేదన వ్యక్తం చేశారు. పౌరసరఫరా జిల్లా మేనేజరు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ఈ సమస్యను జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, జిల్లా పౌరసరఫరా అధికారి ప్రసాద్, సహాయాధికారి విజయభాస్కర్, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పి.స్వర్ణలత, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, మూడు మండలాల వ్యవసాయాధికారులు, సీఎస్ డీటీ సుజాత పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చాగల్లు: మండలంలో గ్రామ సచివాలయాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎంపీడీవో బి.రాంప్రసాద్ తెలిపారు. చాగల్లు-2 సచివాలయంలో ఒకటి, చిక్కాల-1లో ఒకటి, ఊనగట్లలో ఒకటి, కలవలపల్లి-1లో ఒక పోస్టుకు అర్హులైన అభ్యర్థులు మే ఒకటో తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. గ్రామస్తులై, పదో తరగతి పాసైన 18 నుంచి 35ఏళ్లలోపు వారు అర్హులన్నారు. వచ్చే నెల 3వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఎంపీడీవో తెలిపారు.

ముగిసిన మేరీమాత ఉత్సవాలు

తాళ్లపూడి: వేగేశ్వరపురంలోని నిత్య సహాయ గోదావరి మేరీమాత పుణ్యక్షేత్ర మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. పుణ్యక్షేత్ర డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ టి. జాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం సమిష్టి దివ్యబలి పూజలో స్వాగత నృత్యాలతో ప్యారిస్ పరిధిలోని ఫాదర్లు పాల్గొన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

పొగాకు క్రాప్ కమిటీ నియామకం

గోపాలపురం: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల వర్జీనియా పొగాకు పంట కమిటీ సభ్యుల నియామకం ఆదివారం గోపాలపురం పొగాకు వేలం కేంద్రం వద్ద నిర్వహించినట్లు రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య తెలిపారు. కమిటీ అధ్యక్షుడిగా పరిమి జగదీష్, ఉపాధ్యక్షుడి కాకర్ల శేషు, కార్యదర్శిగా అల్లూరి సోమేశ్వరరావు, మరో ఏడుగురు సభ్యులను రైతులు ఎంపిక చేసినట్టు ఆర్ఎం చెప్పారు. గోపాలపురం పొగాకు వేలం కేంద్రం అధ్యక్షుడు చిన్నమనేని మధుమోహన్, కార్యదర్శి ఇల్లూరి రాంబాబు, ఇల్లూరి పెంటలరాజు అయిదు వేలం కేంద్రాల అధ్యక్షుడు రైతులు పాల్గొన్నారు.

గాయపరచిన భర్తపై కేసు

కొవ్వూరు: తన భర్త రాయితో కొట్టి గాయపరిచారని తొగుమ్మి గ్రామానికి చెందిన కందుల హిమబిందు ఫిర్యాదు చేసినట్టు రూరల్ హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్ కరుణాకరరావు తెలిపారు. తొగుమ్మికి చెందిన విజయ్‌తో 2014లో వివాహమైందని, మూడేళ్లు సంసారం సాఫీగా సాగిందన్నారు. అనంతరం తాగుడికి బానిసై తరుచూ గొడవ పడుతున్నాడని, ఆదివారం గొడవ పడి ఇటుకతో దాడి చేసినట్టు భార్య ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

మండల స్థాయిలో మినీ రైస్ మిల్లుల ఏర్పాటు

దేవరపల్లి: రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మండల స్థాయిలో మినీ రైస్ మిల్లులను ఏర్పాటు చేస్తున్నట్టు పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజరు నాగార్జునరెడ్డి తెలిపారు. శనివారం దేవరపల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గోపాలపురం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో మినీ రైస్ మిల్లులు ఏర్పాటు చేసి, వాటికి అవసరమైన టెక్నికల్ సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని మినీ మిల్లుల్లో ఆడి నూకశాతం తెలుసుకుని మిల్లులకు పంపిస్తామన్నారు. గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, నల్లజర్లచ గోపాలపురం మండలాల్లో 45 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, మిల్లుల సామర్థ్యం 10 వేల మెట్రిక్ టన్నులు ఉందన్నారు. దీని వల్ల అనపర్తిలోని 22 మిల్లును మూడు మండలాలకు కేటాయించి ట్యాగ్ అప్ చేసినట్టు ఆయన తెలిపారు. నియోజకవర్గంలో 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రోడ్లపై ఉందన్నారు. మరొక 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం పొలాల్లో ఉందన్నారు. 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తక్షణం మిల్లులకు పంపించాలని, దీని కోసం ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. మిల్లుల వద్ద రైతులకు ఇబ్బంది లేకుండా జాయింట్ కలెక్టర్ దృష్టికితీసుకువెళ్లి నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. జిల్లాలో 130 కోట్ల విలువ గల ధాన్యం కొనుగోలు చేయగా, తొమ్మిది రోజుల్లో రూ.70 కోట్లు రైతుల ఖాతాలకు జమచేసినట్టు ఆయన చెప్పారు. సంచుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ప్రథమ బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణం కనుల పండువగా జరిగింది. అమ్మవార్లను పెండ్లి కుమార్తెగాను, స్వామి వారిని పెండ్లి కుమారుడిగా అలంకరణ చేసి వేదపడితులు కల్యాణ వేదికపైకి తీసుకువచ్చి కల్యాణ తంతు నిర్వహించారు. తొలుత స్వామి వారి ఉత్సవ మూర్తులను గ్రామ పురవీధుల్లో రథంపై ఊరేగించి ఆలయానికి తీసుకువచ్చారు. రాత్రి 8.30 గంటలకు కల్యాణం ప్రారంభించారు. అమ్మవార్లకు గ్రామానికి చెందిన పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సారె పెట్టారు. ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారికి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. రాత్రి 11 గంటల శ్రీనివాసుని కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు కల్యాణ అక్షితలు, ప్రసాదాలు అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

వాసవీమాత జయంత్యుత్సవాలు

కొవ్వూరు: వాసవీ కన్యాకా పరమేశ్వరీ జయంత్యుత్సవాలు పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు, విజయలక్ష్మి దంపతులు చేతుల మీదుగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు సత్యవరపు గోపాలకృష్ణ, మట్టే ప్రసాద్, సంఘ కార్యదర్శి నాళం వీర వెంకట శ్రీనివాసరావు, కోశాధికారి తుమ్మలపల్లి నాగ రమేష్, గౌరవ అధ్యక్షుడు ఎంబీఎస్ ప్రసాద్, వాసవీ ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ కక్కిరాల సూరిబాబు, మద్దుల సత్యనారాయణలతో పాటు భక్తులు పాల్గొన్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరికి పూజలు

చాగల్లు: గ్రామంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్య సంఘం నాయకులు అమ్మవారి కేక్ కట్ చేశారు. అమ్మవారి జీవిత చరిత్రపై క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక శివాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

ఉండ్రాజవరం: గ్రామంలోని ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో కన్యాకా పరమేశ్వర అమ్మవారి జయంత్యుత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక వాహనంలో అమ్మవారి గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది.

వంతెన నిర్మాణానికి శంకుస్థాపన



దేవరపల్లిలో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: స్థానిక ఇసుకవాగుపై వేంకటేశ్వరస్వామి వారి ఆలయ సమీపంలో నిర్మించనున్న వంతెన నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు రూ.7 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఎండీఎఫ్‌డీ నిధులు రూ.1.10 కోట్లతో ఇసుకవాగును అభివృద్ధి పనులు చేస్తున్నట్టు చెప్పారు. దీనిలో రూ.30 లక్షలతో వంతెన నిర్మాణం, రూ.80 లక్షలతో ఇసుకవాగు డ్రైన్ అభివృద్ధి, రూ.25 లక్షలతో గ్రామంలోని రెండు ఎస్సీ శ్మశానాలను అభివృద్ధి చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీరకుమారి, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, ఉపసర్పంచ్ వెలగా సాంబశివరావు, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, మండల సేవాదళ్ చైర్మన్ మాదవరపు వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు కడిమి రాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, దుద్దుకూరు సొసైటీ అధ్యక్షుడు కాండ్రు రామకృష్ణ, నాయకులు తెలిపారు.

అకాల వర్షం.. రైతులకు నష్టం

- తడిసి ముద్దయిన ధాన్యం
- 2 వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంట



వేమవరంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



ధాన్యం బస్తాలను ట్రాక్టర్‌లోకి ఎత్తుతున్న రైతులు

పెరవలి: అకాల వర్షాలు రైతులకు నష్టం కలిగిస్తున్నాయి. మండలంలో శని, ఆదివారాలు కురిసిన అకాల వర్షానికి ధాన్యం ఎక్కడిక్కడ తడిసిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. రబీ సాగు 8500 ఎకరాల్లో సాగు చేయగా ఇప్పటి వరకు 3వేల ఎకరాలు కోతలు పూర్తయ్యాయి. ఈ మండలం నుండి 30,500 మెట్రిక్ టన్నులు ధాన్యం ప్రభుత్వం సేకరించాల్సి ఉండగా ఆదివారం మధ్యాహ్నం వరకు 4800 మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించారు. ఇంకా కళ్లాల్లో ధాన్యం ఉండగా హఠాత్తుగా వచ్చిన వర్షానికి రైతులు ఉరుకులు పరుగులు తీశారు. బరకాలు కప్పటానికి కూడా అవకాశం లేకుండా పోవడంతో ధాన్యం తడిసిపోయింది. దీంతో తడిసిన ధాన్యం రాశులను చూసి రైతులు కన్నీళ్లు పెట్టుకున్నారు. పెరవలి మండలంలో ధాన్యం రాశులుగా సుమారు రెండు వేల ఎకరాల పంట ఉంటుందని అధికారులు అంచనాలు వేస్తున్నారు.

కూలీలకు డిమాండ్

అకాల వర్షం రైతులను మానసికంగా కుంగదీసింది. మరో వైపు తడిసిన ధాన్యం. మరోవైపు కూలీలకు డిమాండ్ పెరిగిపోవడంతో పెట్టుబడి పెరిగిపోయింది. పనులు త్వరగా చేసేందుకు కూలీల దొరకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. కూలీలకు సాధారణంగా రూ.600 ఉంటే ఇప్పుడు వెయ్యి రూపాయలు డిమాండ్ చేస్తున్నారు. పలు చోట్ల అయితే వెయ్యి రూపాయలు ఇస్తామన్నా కూలీలు దొరకటం లేదని రైతులు చెబుతున్నారు.

చాగల్లు మండలంలో 230 ఎకరాల్లో అరటికి నష్టం

చాగల్లు: మండలంలో ఈ నెల 28న వీచిన ఈదురు గాలులకు సుమారు 230 ఎకరాల్లో అరటి తోటలు దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా గుర్తించామని కొవ్వూరు ఉద్యాన శాఖాధికారి సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలో చాగల్లు, నెలటూరు, చంద్రవరం, మార్కొండపాడు, మల్లవరం గ్రామాల్లో అరటి తోటలు గాలులకు నేలకొరిగాయన్నారు. దెబ్బతిన్న పంటల నివేదికను ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు.